క్లుప్తంగా

సిల్క్ ఎక్స్‌పోకు విశేష స్పందన



సిల్క్ ఎక్స్‌పోలో చీరలను పరిశీలిస్తున్న సందర్శకులు

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని నొవోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన నేషనల్ స్కిల్ ఎక్స్‌పోకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జాతీయ స్థాయి నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకున్న వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. పెళ్లిళ్ల, ఉగాది పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోలో సిల్క్ కాటన్, శారీ, సూట్, డ్రెస్ మెటీరియల్, ఫాషన్ జ్యూయలరీ అందుబాటులో ఉన్నాయి. గుజరాత్, జమ్ము కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన వస్త్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. ఈ నెల 13వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తీరంలో శునకాల స్వైర విహారం



సందర్శకురాలి వెంట పడుతున్న శునకాలు

బీచ్ రోడ్డు: తీరంలో శునకాల బెడద ఎక్కువైంది. సందర్శకుల వెంట పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. బీచ్ రోడ్డులో యథేచ్ఛగా తిరుగుతూ అలజడి సృష్టిస్తున్నాయి. తక్షణమే జీవీఎంసీ సిబ్బంది శునకాలను పట్టుకుని వేరే ప్రాంతాలకు తరలించాలని సందర్శకులు కోరుతున్నారు.

ఆలయ ముఖ ద్వారం ప్రారంభం



చిన పోలమాంబ ఆలయ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న చందక సురేష్

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీ పాలెం పీతలవానిపాలెంలో ఉన్న చిన పోలమాంబ అమ్మవారి ఆలయ ముఖ ద్వారం ప్రారంభోత్సవం గురువారం జరిగింది. శ్రీకృష్ణ సేవా సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ ద్వారం నిర్మాణానికి ధన సహాయం చేసిన చందక సురేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు, పూర్వ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సభ్యులు వరలక్ష్మి, లక్ష్మి, సుధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల, శిశు సంక్షేమ శాఖాధికారి సి.నాగేశ్వరి, పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని వాహనాలు?

- నెలల తరబడి పార్కింగ్
- అక్కడ పేరుకుపోతున్న వ్యర్థాలు



రోడ్డు పక్కనే కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు





రహదారి పక్కనే నెల తరబడి పార్క్ చేసి వదిలేసిన వాహనాలు

ఏయూ క్యాంపస్: రహదారిని ఆనుకుని నెలల తరబడి పలు వాహనాలను పార్కింగ్ చేసి వదిలేశారు. పక్కనే వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. డాక్టర్స్ కాలనీ నుంచి ఏయూ అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్‌కు వెళ్లే మార్గంలో ఈ దృశ్యాలు నిత్య కృత్యంగా దర్శనమిస్తున్నాయి.

ఎవరివి ఈ వాహనాలు?

డాక్టర్స్ కాలనీ నుంచి మంగాపురం కాలనీకి వెళ్లే మార్గంలో ఏయూ ప్రహరీకి ఆనుకుని పలు వాహనాలను దీర్ఘ కాలంగా వదిలేశారు. వీటిని ఎవరూ అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయడం లేదు. వాహన యజమానులు వీటిని వినియోగించకపోవడంతో దుమ్ము ధూళి పట్టి దర్శనమిస్తున్నాయి. వాహనాలు పనిచేయని పక్షంలో వీటిని తుక్కుగా అయినా విక్రయించవచ్చు. అయినా వాహన యజమానులు నిర్లక్ష్యంగా వీటిని ఏయూ ప్రహరీకి ఆనుకుని రోడ్డు పక్కనే పార్కింగ్ వదిలేశారు. ఇప్పటికైనా స్పందించి యజమానులు వీటిని అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

వాహనాలను ఆనుకుని కుప్పలుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. జీవీఎంసీ అధికారులు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసినా ప్రజలు మాత్రం వ్యర్థాలను రోడ్డు పైనే పారబోస్తున్నారు. దీంతో నిత్యం ఇక్కడ శుభ్రం చేయడం పారిశుధ్య సిబ్బందికి తలకుమించిన భారంగా మారుతోంది. వ్యర్థాలను కవర్లతో తీసుకువచ్చి గోడ పక్కనే పారవేయడంతో సమీపంలోని కుక్కలు, పశువులు వీటిలో ఉండే ఆహార పదార్థాలను తినడానికి వచ్చి చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో డాక్టర్ కాలనీ నుంచి ఏయూ అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహం వరకు వెళ్లే దాదాపు 300 అడుగుల వరకు మార్గం అధ్వానంగా మారుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ రహదారిని శుభ్రం చేసే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనధికారిక బోర్డుల తొలగింపునకు ఆదేశం



సీతకొండ వద్ద బీచ్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

ఆరిలోవ: జీ-20 సదస్సు నేపథ్యంలో బీచ్ రోడ్డులో ఉన్న అనధికారిక బోర్డులను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. జీ-20 సదస్సు కోసం బీచ్‌రోడ్డును ఆధునికీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సీతకొండ సీవ్యూ పాయింట్, సాగర్‌నగర్, రాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతాలను గురువారం ఆయన అధికారులతో కలసి సందర్శించారు. ఆయా చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు పక్కన పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలని సూచించారు. పనులు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ అలంకరణ, దీపాలు వెలిగించడం, రోడ్డుకు రంగులు వేయడం, వంటి పనులు వేగవంతం చేయాలన్నారు. డివైడర్లు, రోడ్డు పక్కన అందం కోసం మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్, డీడీ(హార్టీకల్చర్) ఎం.దామోదరరావు, జీ-20 లైజినింగ్ ఆర్గనైజర్ చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్, డీసీపీ పద్మజ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల దాడిలో ఒకరికి గాయాలు

ఆరిలోవ: సముద్ర తీరంలో జరిగిన చిన్నపాటి గొడవలో ఓ వ్యక్తిపై ఇద్దరు రౌడీషీటర్లు దాడి చేసి గాయపరిచారు. ఆరిలోవ సీఐ సోమశేఖర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోడుగుళ్లపాలెం బీచ్‌లో బుధవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన డేవిడ్ మద్యం సేవించి ఇసుక దిబ్బపై ఉన్న ఓ బోటులో కూర్చున్నాడు. దీనికి సమీపంలో జోడుగుళ్లపాలేనికి చెందిన రౌడీషీటర్ అప్పలరాజు కూడా మద్యం సేవించి అక్కడికి వెళ్లి బోటులో ఎందుకు కూర్చున్నావంటూ డేవిడ్‌ను ప్రశ్నించాడు. నీకెందుకంటూ డేవిడ్ సమాధానం చెప్పడంతో ఇరువురి మధ్య చిన్నపాటి తగాదా జరిగింది. అంతటితో ఆగకుండా అప్పలరాజు తన స్నేహితుడైన మరో రౌడీషీటర్‌ను పిలిచాడు. అతను అక్కడికి చేరుకుని ఇద్దరు కలసి డేవిడ్‌ను కొట్టారు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. తగిలిన గాయాలతో డేవిడ్ ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రౌడీషీటర్లపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరిలోవ ఎస్ఐ అప్పారావు గురువారం ఇరువురు రౌడీ షీటర్లపై కేసు నమోదు చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ భవానీప్రసాద్

బీచ్ రోడ్డు: సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని, ఎటువంటి సందేహం ఉన్నా తక్షణమే సైబర్ పోలీసులకు 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ సూచించారు. గురువారం దిశా, సైబర్ పోలీసులు సంయుక్తంగా సిరిపురంలోని డబ్ల్యూఎన్ఎస్ సంస్థలో ఉద్యోగాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఇంటర్నెట్ ఆధారంగా, ఆన్‌లైన్ షాపింగ్ పేరిట మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాస్‌వర్డ్ సెక్యూరిటీ టిప్స్, ఫేక్‌లోన్ యాప్స్‌పై అవగాహన కల్పించారు. దిశా సీఐ జి.నిర్మల మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఈవ్‌టీజింగ్, ట్రాఫికింగ్, భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళలకు ఎదురైన సమస్యలపై దిశా యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి



మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

కొమ్మాది: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గురువారం ఎండాడ అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపించగలిగే మహిళలు నేటి కాలంతో పోటీ పడి మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీతామహాలక్ష్మి, అల్లూరి పార్వతి, గోపి, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా చాలా ప్రమాదకరం



ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో మాట్లాడుతున్న వైద్యులు

ఆరిలోవ: కంటికి సోకే గ్లకోమా వ్యాధి చాలా ప్రమాదకరమని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శివాణి, డాక్టర్ సాయి యశ్వంత్ తెలిపారు. వరల్డ్ గ్లకోమా వీక్ సందర్భంగా గురువారం ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్లకు కలిగే ఒత్తిడి కారణంగా గ్లకోమా సోకుతుందన్నారు. దీని లక్షణాలు బయటకు కనిపించవన్నారు. దీంతో గ్లకోమా సోకిన వ్యక్తి కంటి చూపు క్రమంగా పోతుందన్నారు. 40 సంవత్సరాలు దాటిన వారు ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ పరీక్షల్లో గ్లకోమాను గుర్తించడానికి వీలుపడుతుందన్నారు. లేదంటే ఈ సమస్యను గుర్తించలేరన్నారు. ఈ నెల 12 నుంచి 18 వరకు గ్లకోమా వీక్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12న ఉదయం 6 గంటలకు బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు సన్మానం



మంత్రి అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను 68వ వార్డు మిందిలో గురువారం కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు అమర్‌కు శాలువా కప్పి సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది



ఎంపిక కోసం నిర్వహించే పోటీలు ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరఫున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు.

రాష్ట్ర జట్లు ఇవే : రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎన్.లహరి, డి.శృతిప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.

మనవడిని చూడటానికి వచ్చి మహిళ మృతి

తగరపువలస: గుంటూరు జిల్లా గురజాల మండలానికి చెందిన బూదూరి మంగమ్మ అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనవడు జయ ఆదిత్యను చూడటానికి వచ్చి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన సంగివలసలో జరిగింది. భీమిలి ఎస్ఐ తాతారావు తెలిపిన వివరాల ప్రకారం... గురజాలకు చెందిన బూదూరి శివనారాయణ సంతపేట అంబేద్కర్ స్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఆయన కుమారుడు జయ ఆదిత్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సంగివలస ఎన్ఆర్ఐ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలిసిన మంగమ్మ బుధవారం గుంటూరు నుంచి మనవడిని చూసేందుకు విశాఖ వచ్చింది. సంగివలస హైవే వద్ద రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి విశాఖవైపు వేగంగా వెళ్తున్న బైక్ బలంగా ఢీకొనడంతో ఆమె తల, రెండు కాళ్లు, ఎడమచేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఉంచి చికిత్స చేయిస్తుండగా అదేరోజు రాత్రి మరణించింది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



భక్తుల పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నారు.

సమాచారమ్

ఎన్‌సీటీఈ సభ్యుడు ఏయూ సందర్శన



వీసీ ప్రసాదరెడ్డితో ఎన్‌సీటీఈ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గురువారం నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) సభ్యుడు డాక్టర్ చంద్రప్రకాష్‌రెడ్డి సందర్శించారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ఆయనకు వివరించారు. ఏయూను స్వయం సంవృద్ధిగా చేసే దిశగా స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్న విధానాలను తెలియజేశారు. విద్యా రంగంలో జరుగుతున్న మార్పులు, తదనుగుణంగా బీఈడీ, ఎంఈడీ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన విధానాలపై విస్తృతంగా చర్చించారు. వర్సిటీ తరఫున డాక్టర్ ప్రకాష్‌రెడ్డిని వీసీ సత్కరించారు. అనంతరం ఏయూ విద్యా విభాగంలో ఆచార్యులతో ప్రకాష్‌రెడ్డి సమావేశమయ్యారు. నూతన విద్యా విధానం ప్రాధాన్యతను వివరించారు. దేశ గతిని మార్చే విధంగా దిశానిర్దేశం చేస్తూ నూతన విద్యా విధానం అమలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, ఆచార్య నాగరాజ కుమారి, ఆచార్య శర్మ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాల్య వివాహానికి బ్రేక్



వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు, చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక వివాహానికి బ్రేక్ పడింది. అర్ధరాత్రి సమయంలో జరగాల్సిన వివాహం గురువారం సాయంత్రమే నిలిచిపోయింది. ఐసీడీఎస్, సీడ్ చైల్డ్‌లైన్ సంస్థల ప్రతినిధులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సుమారు 17 ఏళ్ల బాలికకు జీవీఎంసీ 10వ వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన 26 ఏళ్ల యువకుడితో వివాహం నిశ్చయమైంది. వారి తల్లిదండ్రులు రవీంద్రనగర్‌లో ఓ కల్యాణ మండపంలో గురువారం వివాహం చేయడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి 12 గంటలకు వారికి వివాహం జరిపించే హడావిడిలో అంతా ఉన్నారు. ఇంతలో అజ్ఞాత వ్యక్తులు చైల్డ్‌లైన్ సంస్థ టోల్‌ఫ్రీ నంబరు 1098కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ జిల్లా అధికారి వి.సరిత, చైల్డ్ లైన్ సంస్థ ప్రతినిధులు మీనాకుమారి, సుబ్బలక్ష్మి, చినగదిలి మండలం ఆర్ఐ ప్రవీణ్, మహిళా పోలీసులు సత్యవేణి, స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, తదితర సిబ్బంది రవీంద్రనగర్‌లోని కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. వధూవరుల వయస్సులు తెలుసుకున్నారు. పెళ్లి కుమార్తె ఇంకా మైనర్ అని, వివాహం నిలిపేయాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, తాళి కట్టే సమయానికి ఎలా నిలిపేయమంటారని ఇరువురి తల్లిదండ్రులు అధికారులతో వాదనకు దిగారు. దీంతో వారికి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు బాల్య వివాహంపై అవగాహన కల్పించారు. వివాహం జరిపితే అందరూ శిక్షార్హులవుతారని హెచ్చరించారు. దీంతో వివాహం ఆగిపోయింది.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



సుధాకర్‌కు మద్దతుగా 11వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని



సంక్షేమ భవన్ ఉద్యోగులకు కరపత్రాలు అందజేస్తున్న పితాని ప్రసాద్ తదితరులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా తూర్పు నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు గురువారం విస్తృత ప్రచారం చేశారు. జీవీఎంసీ 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ముస్తఫాకాలనీ, అప్సరా కాలనీలలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. సీతంరాజు ఫొటో, పేరుతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జహంగీర్, మక్బుల్, బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, తదితరులు కరపత్రాలు అందజేసి, సీతంరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు

ఆరిలోవ: కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అపోలో నెఫ్రాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ రవిరాజు తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం అపోలోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు దశాబ్దం నుంచి కిడ్నీ వ్యాధులు పెరిగాయన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడమే కారణమన్నారు. వాటి లక్షణాలను గుర్తించగలగాలన్నారు. ఆకలి తగ్గడం, ఆయాసం రావడం, కాళ్లు పొంగులు రావడం తదితర లక్షణాలు కిడ్నీ వ్యాధి ప్రారంభ దశకు లక్షణాలని సూచించారు. అలాంటి లక్షణాలు కనిపించినవారు వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలన్నారు. బీపీ, మధుమేహం, వృద్ధాప్యంలో ఉన్నవారిలో ఎక్కువ శాతం మందికి కిడ్నీ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు జెనిటిక్ కారణంగా కూడా రావచ్చన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ అనిల్ మహాపాత్రో, డాక్టర్ వంశీధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల వినతి



డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

మహారాణిపేట : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి గురువారం వినతిపత్రం సమర్పించారు. 2018 నుంచి బకాయి ఉన్న డీఆర్, ఎరియర్లు సత్వరం చెల్లించాలని,11వ పీఆర్‌సీలో ఉన్న లోపాల సవరణకు అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు కోరారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి నూతన వేతన సవరణలు అమలు చేయవలసి ఉన్నందున తక్షణం 12వ పే కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. హెల్త్‌కార్డులపై అన్ని ఆస్పత్రుల్లోను క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ వర్తింపజేయాలని డీఆర్‌వోకు, ట్రెజరీ శాఖ ఏటీవోకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఎ.సాయిబాబా, డీఎస్ఎన్ మూర్తి, టీవీ రమణమూర్తి, విశ్వేశ్వరరావు, బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.